క్లుప్తంగా

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు స్టాపర్లు



స్టాపర్ బోర్డులతో డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ, ఎస్సైలు, షాపింగ్ మాల్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానికంగా పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యం 30 స్టాపర్ బోర్డులను పట్టణ పోలీసు శాఖకు సమకూర్చింది. స్థానిక డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, పట్టణ సీఐ టి.క్రాంతికుమార్, పట్టణ ట్రాఫిక్ ఎస్సై పీఎస్వీఎస్పీసీహెచ్‌బీ రాజులకు ఈ బోర్డులను ఆ షాపింగ్ మాల్ ప్రతినిధులు సోమవారం అందించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు స్టాపర్ బోర్డులు అందించిన ఎస్ఆర్ షాపింగ్ మాల్ యాజమాన్యానికి డీఎస్పీ అంబికాప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఆ షాపింగ్ మాల్ ఏరియా మేనేజర్ పి.ఫిరోజ్ ఖాన్, మేనేజర్ కె.శివారెడ్డి, పబ్లిసిటీ వెండర్ డి.జాన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలశ పూజ

యానాం: యానాం బైపాస్ రహదారిలోని కనకాలపేటలో అయ్యప్ప స్వాముల 108 కలశ పూజ, మహా లక్షార్చన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు కాటంశెట్టి వెంకటరామ్మూర్తి, పీఠం బృందం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పూజలకు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ హాజరవుతారన్నారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి గణపతి హోమం, 8 గంటల నుంచి వడి, మధ్యాహ్నం స్వాములకు భిక్ష అనంతరం పేటతుళ్లి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. కోన గురుస్వామిచే సాయంత్రం 6 గంటల నుంచి కలశపూజ, లక్షార్చనపూజ, వడిపూజ ఉంటుందన్నారు.

రేపు అల్లవరంలో 'జగనన్నకు చెబుదాం'

అల్లవరం: కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమోహన్ సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ జరిగే ఈ కార్యక్రమానికి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ సాంబశివప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంపై ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు.

సేవల్లో అమలాపురం వాకర్స్ క్లబ్‌కు అవార్డు



రవీంద్ర చేతుల మీదుగా అవార్డు అందుకున్న క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ ఆరోగ్య కార్యకలాపాల నిర్వహణలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఆరోగ్య అవగాహన సదస్సులు, ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహించి 2023 సంవత్సరానికి అవార్డుకు ఎంపికైనట్లు జిల్లా వాకర్స్ గవర్నర్ మాచవరపు భాస్కరరావు ప్రకటించారు. రాజమహేంద్రవరంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వాకర్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్సీ రవీంద్ర చేతుల మీదుగా స్థానిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్ అవార్డును అందుకున్నారు. వాకర్స్ సీనియర్ ప్రతినిధులు డాక్టర్ పీఎస్ శర్మ, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, రంకిరెడ్డి కాశీ, తేతల సత్యనారాయణరెడ్డి, పచ్చిగోళ్ల శ్రీనివాసరావు, పుత్సా రాజేశ్వరి తదితరులు అమలాపురం క్లబ్‌ను అభినందించారు.

కొబ్బరి ఉత్పత్తులపై అవగాహన



ముమ్మిడివరం కొబ్బరి నూనె పరిశ్రమలో మహిళలు

ముమ్మిడివరం: నాబార్డు సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లైవ్ ఉడ్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ పొందిన మహిళలకు కొబ్బరి ఉప ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తయిన ఈదరాడ, పాశర్ల పూడి, జనుపల్లి గ్రామాలకు చెందిన మహిళలు సోమవారం ముమ్మిడివరంలోని కొబ్బరి నూనె ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. కొబ్బరి నూనె ఉత్పత్తి, కొబ్బరి ఉప ఉత్పత్తులపై వారికి అవగాహన కల్పించారు. నాబార్డు ఏజీఎం వై.సోమునాయుడు, ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరమ్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగ దినోత్సవం

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో సోమవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకొన్నారు. కళాశాలలో కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎస్ వర్మ అధ్యక్షతన ఈ వేడుకలు జరిగాయి.

సదా శివాయ.. సర్వ మంగళప్రదాయ

- వేడుకగా కార్తిక సోమవారం పూజలు
- కిటకిటలాడిన శివాలయాలు

ఐ.పోలవరం: సదా శివాయ.. సర్వ మంగళప్రదాయ అంటూ ఆ నీలకంఠేశ్వరస్వామిని భక్తజనం మనసారా కొలిచింది.. కార్తిక పౌర్ణమి, సోమవారం కలసి రావడంతో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని శైవ క్షేత్రాలు భక్తులతో రద్దీగా కనిపించాయి. మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం శివనామ స్మరణతో మార్మోగింది. తెల్లవారు జాము నుంచే జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి వృద్ధ గౌతమీ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ఆవరణలోని తులసి కోట వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. విద్యార్థులు, పిల్లలు, మహిళలు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. సుమారు 10 వేల మంది ఆలయాన్ని దర్శించుకున్నట్లు చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. స్వామివారికి నిజరూప దర్శనంతో జరిగే ప్రథమాభిషేకాలు 350, లఘున్యాస పూర్వక అభిషేకాలు 572 జరిగాయి. భక్తులకు ఇబ్బంది కలగకుండా రెండు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే ప్రసాదం వితరణ, మంచినీటి సరఫరా, అన్నదానం సౌకర్యం కల్పించారు. కేశనకుర్రుపాలెంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. టి.కొత్తపల్లి, ఐ.పోలవరం, కేశనకుర్రు, జి.వేమవరం, ఎదుర్లంక తదితర గ్రామాల్లోని శివాలయాలు కిక్కిరిశాయి.

అల్లవరం: దేవగుప్తంలో ఉమా సమేత మల్లేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం రాత్రి జ్వాలా తోరణ మహోత్సవం నిర్వహించి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం ఉదయం అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్.రామేశ్వరంలో పార్వతీ సమేత రామేశ్వరస్వామి ఆలయం, లక్ష్మణేశ్వరంలో లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోడి, బెండమూర్లంక, అల్లవరం తదితర గ్రామాల్లోని ఆలయాలు రద్దీగా మారాయి.



పిల్లంక, బ్రహ్మపురి శివాలయంలో విశ్వేశ్వరస్వామివారికి అభిషేకాలు చేస్తున్న భవానీలు

తాళ్లరేవు: పిల్లంక, బ్రహ్మపురి సరిహద్దులో వేంచేసియున్న అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష రుద్రాక్ష, లక్షపత్రి పూజలను వైభవంగా నిర్వహించారు. వేద పండితుడు వేలూరి వెంకట కామేశ్వరశర్మ (కాశిబాబు) నేతృత్వంలో అభిషేకాలు చేశారు. అనంతరం లక్ష బిల్వార్చన నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన చేశారు.

అమలాపురం రూరల్: అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లో శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద కార్తిక దీపోత్సవం జరిగింది. మహిళలు దీపాలు వెలిగించేందుకు పోటీ పడ్డారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగాబత్తుల రాంబాబు అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

ఉప్పలగుప్తం: భీమనపల్లి అనంగేశ్వరస్వామి, చల్లపల్లి చౌడేశ్వరస్వామి, గొల్లవిల్లి భీమేశ్వరస్వామి, ఉప్పలగుప్తం, మునిపల్లి పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. విలసవిల్లి రామాలయం వద్ద పురోహితుడు రామకృష్ణ శర్మ ఆధ్వర్యంలో జ్యోతిర్లింగార్చన జరిగింది.



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో పూజలు



అమలాపురం శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద దీపోత్సవం



మురమళ్ల వీరేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు చేస్తున్న పండితుడు

అందరి సహకారంతో అభివృద్ధి పథం



అమలాపురం మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

- మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి
- యూజర్ చార్జీల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు
- సిబ్బందిపై కౌన్సిలర్లు ధ్వజం

అమలాపురం టౌన్: అందరి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మాట్లాడుతూ చెత్తపై యూజర్ చార్జీల వసూళ్లలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ప్రతిసారి మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి గ్రీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)కు ఈఎంఐ చెల్లించాల్సి వస్తుందని ధ్వజమెత్తారు. పాలకపక్ష కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, దొమ్మేటి రాము మాట్లాడుతూ యూజర్ చార్జీలు సక్రమంగా వసూలు చేయకపోవడంతో రూ.22.30 లక్షల నిధులు మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రీయంబర్స్‌మెంట్ కింద చెల్లించాల్సి వస్తుందన్నారు. దీనిపై మున్సిపల్ డీఈఈ నాగసతీష్, ఏఈ వెంకటేష్ మాట్లాడుతూ ఇక నుంచి పక్కా పర్యవేక్షణతో సిబ్బందితో యూజర్ చార్జీలు వసూలు చేయిస్తామన్నారు. తర్వాత రూ.22.30 లక్షల బకాయిల్లో రూ.10 లక్షల నిధులు మున్సిపాలిటీ చెల్లించేలా కౌన్సిల్ తీర్మానం చేసింది. మున్సిపాలిటీలోని 4,600 వీధి దీపాల నిర్వహణను కాంట్రాక్ట్ సంస్థకు అప్పగించిన నేపథ్యంలో మెయింటెనెన్స్ పూర్తిగా ఆ సంస్థే భరించాలని కౌన్సిలర్లు అన్నారు. దాదాపు 95 శాతం నిధులు కాంట్రాక్ట్ సంస్థకు చెల్లించిన క్రమంలో ఇంకా మెటీరియల్ నిమిత్తం అంటూ రూ.4.80 లక్షలు ఇవ్వాలన్న అంశాన్ని పాలకపక్ష కౌన్సిలర్లు వ్యతిరేకించారు.

కాంట్రాక్టర్లపై చర్యలు శూన్యం

మున్సిపాలిటీలో రూ.కోట్లతో ఆమోద ముద్ర చేసిన పనులను సంబంధిత కాంట్రాక్టర్లు మొదలు పెట్టడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వార్డులో డ్రెయిన్‌ను ఆక్రమించి ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపట్టారని, అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదని పాలక పక్షానికి చెందిన 25వ వార్డు కౌన్సిలర్ దొంగ నాగ సుధారాణి అన్నారు. సమావేశానికి మున్సిపల్ కమిషనర్, మేనేజర్, టీపీవో వంటి ముఖ్యమైన అధికారులు రాకపోవడంతో అజెండాలోని 10వ అంశాన్ని పాలకపక్షం రద్దు చేసింది. అలాగే వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు పలు సమస్యలపై చర్చించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

ముమ్మిడివరం: ప్రజా శ్రేయస్సు దృష్ట్యా పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ హాల్‌లో సర్వసభ్య సమావేశం జరిగింది. ఫ్లోర్‌లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ వార్డుల్లో పారిశుధ్యం అంతంత మాత్రంగానే ఉందని, అధికారులు ఎందుకు శ్రద్ధ చూపడం లేదని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులను నియమించాలని కౌన్సిల్ తీర్మానించినా ఎందుకు పట్టించుకోవడం లేదని అన్నారు. దీనిపై కమిషనర్ జి.లోవరాజు స్పందిస్తూ పారిశుధ్య కార్మికులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించడానికి కౌన్సిల్ తీర్మానాన్ని ప్రభుత్వానికి నివేదించామని అన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా అవసరమైన కార్మికులను నియమించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ సూచించారు. బైపాస్ రోడ్డును ఆనుకుని కొండాలమ్మ చింత సమీపంలో ఇరిగేషన్ పంట బోదెను పూడ్చి అక్రమ లేఅవుట్ వేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రతిపక్ష సభ్యుడు ములపర్తి బాలకృష్ణ ప్రశ్నించారు. దీనిపై రెవెన్యూ అధికారులు వివరణ ఇస్తూ సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా విడుదలైన నిధులతో ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ చైర్మన్లు వేటుకూరి బోసురాజు, రెడ్డి హేమసుందరి తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం మున్సిపల్ సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

సీఎం జగన్‌తోనే పేదల అభ్యున్నతి



తాళ్లరేవులో భూ హక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

తాళ్లరేవు: పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని టీటీడీ పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బూరెల వెంకట్రాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 27 లక్షల ఎకరాల భూమి పేదల వద్ద ఉందన్నారు. అయితే వారికి సంపూర్ణ హక్కులు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో సీఎం జగన్ సుమారు 15 లక్షల ఎకరాల భూమికి సంబంధించిన లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్నారన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా పేదలకు మేలు చేయాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గాడిమొగ పంచాయతీలో గతంలో ఎస్సీలకు చెరువులకు భూమి కేటాయించారని, ఆ భూములకు కూడా యాజమాన్య హక్కు పత్రాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. వచ్చే రోజుల్లో వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచనున్నట్లు తెలిపారు. కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిశోర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల పట్ల ఉదారతతో 2003కు ముందు అసైన్డ్ భూముల్లో డి-పట్టాలు పొంది సాగు చేసుకుంటున్న లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ యాజమాన్య హక్కు కల్పించిందన్నారు. అనంతరం 22 మంది లబ్ధిదారులకు 32.62 ఎకరాలకు సంబంధించి భూ యాజమాన్య హక్కు పత్రాలను ఎమ్మెల్యే పొన్నాడ అందజేశారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, డిప్యూటీ తహసీల్దార్ సూరిబాబు, ఆర్ఐ సాయితేజ, వైస్ ఎంపీపీ డి.నాగేంద్రప్రసాద్, నాయకులు రెడ్డి రెడ్డిబాబు, రేవు మల్లీశ్వరి, ఆకుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



సాధించిన పతకాలతో అమలాపురం విద్యార్థులు, జిల్లా అధ్యక్షుడు అంజి, రిఫరీలు

అమలాపురం టౌన్: ఆత్మరక్షణ ఉపయోగపడే యుద్ధకళ అయిన జియు-జిట్స్ క్రీడలో అమలాపురం విద్యార్థులు ప్రతిభ చాటారని ఆ క్రీడ జిల్లా అధ్యక్షుడు పండాల అంజి తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగిన జియు-జిట్స్ రాష్ట్ర ఎంపికల్లో అమలాపురం విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అండర్-12, 45 కిలోల విభాగాల్లో అమలాపురం విద్యార్థి అడపా రవిశంకరి, అండర్-19, 65 కిలోల విభాగంలో దేశనీడి మానస, అండర్-14, 52 కిలోల విభాగంలో చెల్లుబోయిన వినీషా, సుసత్య, అండర్-12, 38 కిలోల విభాగంలో గుత్తుల హాశ్విత, అండర్-10, 36 కిలోల విభాగంలో గుత్తుల ఆకాష్, అండర్-16, 74 కిలోల విభాగంలో పోతంశెట్టి విష్ణు సాయిసంపత్, అండర్-14, 52 కిలోల విభాగంలో బొలిశెట్టి యశస్విని, అండర్- 14, 36 కిలోల విభాగంలో పందిరి సాయి ప్రణవ్ బంగారు పతకాలు సాధించాని అంజి తెలిపారు. అలాగే అండర్-14, 39 కిలోల విభాగంలో కముజు వైష్ణవి, అండర్-14, 36 కిలోల విభాగంలో దంగేటి బాలాదిత్య, అండర్-12, 50 కిలోల విభాగంలో బండారు సాయి మోహన్ గంగాధర్, అండర్-12, 45 కిలోల విభాగంలో కుడుపూడి జ్ఞానేశ్వరి లక్ష్మి హర్షిత, అండర్-12, 52 కిలోల విభాగంలో నందుల షణ్ముఖ్ రజిత పతకాలను గెలుచుకున్నారు. వీరంతా 2014 ఫిబ్రవరిలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అంజి వివరించారు.

యశ్వంత్‌కు బంగారు పతకం



అబ్దుల్ కరీం, మురళీమోహన్ చేతులమీదుగా పతకాన్ని అందుకుంటున్న యశ్వంత్

అమలాపురం రూరల్: సాకుర్రు గ్రామానికి చెందిన తాడికొండ యశ్వంత్ బీఎస్సీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఇటీవల విజయవాడలో జరిగిన కె.ఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయ 13వ స్నాతకోత్సవంలో బంగారు పతకాన్ని అందుకున్నాడు. విజువల్ కమ్యూనికేషన్స్ విభాగం బీఎస్సీలో ఆ విశ్వవిద్యాలయంలో ప్రథమ స్థానంలో నిలిచి ప్రపంచ సైన్స్ అకాడమీ అధ్యక్షుడు ఇటలీకి చెందిన ప్రొఫెసర్ కరైషా అబ్దుల్ కరీం, సినీనటుడు మురళీమోహన్‌ల చేతుల మీదుగా అతను పతకాన్ని అందుకున్నారు. యశ్వంత్‌ను సర్పంచ్ గుత్తుల చిరంజీవి, తాతాయ్య తాడికొండ సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ శ్రీపాద రామకృష్ణ, గ్రామస్తులు అభినందించారు.

పంచాయతీరాజ్ డీఈ మృతి



రమేష్

ముమ్మిడివరం: స్థానిక సబ్ డివిజన్ పంచాయతీరాజ్ డీఈగా పనిచేస్తున్న జీబీవీ రమేష్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన మృతికి ఈఈ కె.చంటిబాబు, ఎస్ఈ బీవీఎస్ మూర్తి, డీఈఈ అన్యం రాంబాబు, జేఈ శ్రీనివాసరావు, సబ్ డివిజన్ అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

సస్యరక్షణతో నాణ్యమైన నారుమడి

అంబాజీపేట: సస్యరక్షణ చర్యలతోనే నాణ్యమైన నారుమడిని తయారు చేసుకోవాలని ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త అనూష అన్నారు. నాబార్డు సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొబ్బరి ఆధారిత పరిశ్రమలపై లెవిల్‌హుడ్ అండ్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎల్ఈడీపీ) శిక్షణ పూర్తి చేసుకున్న ఈదరాడ, పాశర్లపూడి, జనుపల్లి గ్రామాల మహిళలు అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ కొబ్బరి మొక్కలను శాస్త్రీయ పద్ధతిలో నాటడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. కొబ్బరిచెట్లు తెగుళ్లు, వ్యాధుల బారిన పడకుండా యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

ఉప్పలగుప్తం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కడిమి చిన్నవరాజు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. లబ్ధిదారులకు ఆయుష్మాన్ హెల్త్ కార్డులను జెడ్పీటీసీ సంపదరావు అందించారు. ఉప్పలగుప్తం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు చిక్కం త్రినాథ, ఉప సర్పంచ్ మోకా శ్రీను, ఈఓపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి పాల్గొన్నారు. గొల్లవిల్లిలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో ఈ సంకల్ప యాత్ర జరిగింది.

నేటి నుంచి యానాంలో..

యానాం: కేంద్ర పథకాలపై ప్రచారం చేసేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర మంగళవారం నుంచి యానాం నియోజకవర్గంలో సాగుతుందని ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలకు కనకాలపేట హైస్కూల్‌కు యాత్ర వాహనం వస్తుందన్నారు.

పండ్ల పంపిణీ

తాళ్లరేవు: కోస్టల్ ప్రాన్ హేచరీస్ ప్రతినిధి, సప్తగిరి హేచరీస్ అధినేత సత్తి సూర్యనారాయణ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ మానసిక దివ్యాంగుల కేంద్రంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. సోమవారం ఆ కేంద్రంలో సూర్యనారాయణ రెడ్డి బర్త్ డే కేకును మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్‌లు దివ్యాంగులతో కలసి కట్ చేశారు. తాడి షణ్ముఖరాజు, ఎంవీ గోపాల్, స్టీవెన్, సత్తిబాబు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు క్షీరాభిషేకం



ముత్యాలమ్మకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు ఆధ్వర్యంలో పంపన దుర్గాప్రసాద్, అనూష దంపతులు ఈ పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, విళ్ల సత్యనారాయణ, విళ్ల వీర, ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ మంగళపల్లికి శిక్షా భారతి పురస్కారం



శిక్షా భారతి పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ అరుణ్‌కుమార్

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన విద్యావేత్త, స్థానిక యేడిది సత్యనారాయణ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంగళపల్లి అరుణ్‌కుమార్ జాతీయ స్థాయి శిక్షా భారతి పురస్కారాన్ని అందుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐఈఆర్), రష్యాకు చెందిన ఏఎసీఎస్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ అరుణ్‌కుమార్‌ను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. విద్యాపరంగా పలు పరిశోధనలు, అధ్యయనాలు చేస్తూ పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పరిశోధన పత్రాలు సమర్పిస్తున్నందుకు ఆయనను ఆ పురస్కారం వరించింది. న్యూ ఢిల్లీలోని రష్యా దౌత్య కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని తాను అందుకున్నట్లు డాక్టర్ అరుణ్‌కుమార్ సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయనను యేడిది సత్యనారాయణ విద్యా సంస్థల యాజమాన్యం అభినందించింది.

శెట్టిబలిజ వన సమారాధనకు తరలిరండి



వన సమారాధన బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న సంసాని నాని, ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: కోనసీమ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో అమలాపురంలోని సూర్యనగర్ వాసర్ల గార్డెన్‌లో డిసెంబర్ 3న జరగనున్న శెట్టిబలిజ కార్తిక వన సమారాధనకు వేలాదిగా తరలిరావాలని శెట్టిబలిజ సంఘ నాయకుడు సంసాని నాని పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో శెట్టిబలిజ కులస్తులను ఆయన కలసి కార్తిక వన సమారాధనకు ఆహ్వానించారు. అనంతరం కార్తిక సమారాధన బ్రోచర్‌ను ప్రదర్శించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ నాయకులు దంగేటి రుద్ర, దొమ్మేటి శ్యాం ప్రకాష్, బొక్కా శ్రీను, దొమ్మేటి సురేష్, చెల్లుబోయిన రమేష్ పాల్గొన్నారు.

చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరిల్లో ఎలక్ట్రిక్ వాహనాలు పెరుగుతున్న దృష్ట్యా త్వరలో విద్యుత్ చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు సోమవారం అధికారులు తెలిపారు. ఇప్పటికే రాజస్థాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ ఇనిస్ట్రుమెంట్స్ కంపెనీతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. ఈ మేరకు ఎల్జీ సైతం ఈ ఒప్పందానికి పచ్చజెండా ఊపారన్నారు.

కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న తలారి వాసు

కాట్రేనికోన: స్థానిక తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి చింతా రాంబాబు రచించిన కవితా సంపుటి విరమించని వాక్యం, ఆయన మిత్రుడు మట్టపర్తి నాగరమేష్‌తో కలసి రచించిన నానీల బంధం అనే కవితా సంపుటిలను సోమవారం ఆవిష్కరించారు. అమలాపురంలో అనంత సాహితీ వేదిక ఆధ్వర్యంలో నన్నయ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ తెలుగు విభాగాధిపతి, నన్నయ్య వాణీ కోఆర్డినేటర్ తలారి వాసు చేతుల మీదుగా కవితా సంపుటి ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో అడబాల జగపతి, మల్లాడి శ్రీనివాస్, జగన్, బి.శ్రీనివాసరావు, గౌరీ శంకరరావు తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాల అందజేతకు చర్యలు

యానాం: విద్యార్థులకు సాయంత్రం వేళల్లో చిరుధాన్యాలను స్నాక్స్‌గా ఇవ్వడానికి, ఉచిత ల్యాప్‌టాప్‌ల పంపిణీకి సంబంధించిన ఫైలును సోమవారం ఎల్జీ తమిళిసై సౌందరాజన్ ఆమోదించారని అధికారులు తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రంగసామి ప్రకటించిన విధంగా సాయంత్రం స్నాక్స్‌గా చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యాశాఖ దానికి సంబంధించిన ఫైలును ఎల్జీకి పంపగా ఆమోదం లభించింది.

గృహ హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ఉప్పలగుప్తం: బాల్య, బలవంత వివాహాలు, గృహ హింసను వ్యతిరేకిస్తూ స్థానికంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. వెలుగు ఏపీఎం జి.భూపతివర్మ పాల్గొన్నారు.